GSTIN-NO:36FKPSI308PIZX


epaper:tmedia.net.in

# టి-మీడియా

సామాజికం... ప్రజల పక్షం

మెయిన్ : ఆదివారం- డిసెంబర్ 17-2023 పేజీలు : 3

## రతన్ టాటాకు బెదిరింపులు..



**టీ మీడియా, డిసెంబర్ 16, ముంబయి :**

ప్రముఖ పారిశ్రామికవేత్త రతన్ టాటాకు బెదిరింపులు రావడం కలకలం రేపింది. ఇటీవల ముంబయి పోలీసు కంట్రోల్ రూమ్‌కు గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి.. రతన్ టాటా ప్రాణానికి ముప్పు ఉందని హెచ్చరించినట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి. టాటా భద్రతను పెంచాలని.. లేదంటే ఆయనకు కూడా సైరస్ మిస్త్రీలాగే అవుతుందని పేర్కొన్నట్లు తెలిపాయి. ఈ వారం ఆరంభంలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీంతో అప్రమత్తమైన పోలీసులు రతన్ టాటా భద్రతను పెంచడంతో పాటు కొన్ని తనిఖీలు కూడా చేపట్టినట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి. అదే సమయంలో ఆ ఫోన్ కాల్ చేసిన వ్యక్తి గురించి దర్యాప్తు చేపట్టారు. కర్ణాటక నుంచి ఆ ఫోన్ వచ్చినట్లు గుర్తించి.. వెంటనే అక్కడికి వెళ్లి అతడిని అరెస్టు చేశారు. నిందితుడిని పుణెకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. కొద్ది రోజుల క్రితమే ఇంటి నుంచి వెళ్లిపోయిన అతడు.. కర్ణాటక నుంచి ముంబయి పోలీసులకు ఫోన్ చేసినట్లు దర్యాప్తులో తేలింది. నిందితుడు మానసిక సమస్యలతో బాధపడుతున్నట్లు పోలీసు వర్గాలు పేర్కొన్నాయి. ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపాయి.టాటా సన్స్ మాజీ ఛైర్మన్ అయిన సైరస్ మిస్త్రీ గతేడాది సెప్టెంబరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన విషయం తెలిసిందే. అహ్మదాబాద్ నుంచి ముంబయి వెళ్తుండగా ఆయన ప్రయాణిస్తున్న కారు డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో మిస్త్రీతో పాటు కారులో ఉన్న మరో వ్యక్తి కూడా ప్రాణాలు కోల్పోయారు.

# అయ్యప్ప దర్శనానికి రావాలా.?

- అయ్యప్ప భక్తుల ఆవేదన, ఆందోళన

## ఇరుముడితో ఇక్కడే ఆగిపోవాలా.?



**టీ మీడియా, డిసెంబర్ 16, శబరి :**

శబరిలో రద్దీ ఇంకా క్రమబద్దీకరించబడలేదు. అంతకంతకూ రద్దీ పెరుగుతోంది. అక్కడి పరిస్థితులు తెలుసుకొని వెళ్లాలా వద్దా అని చాలా మంది సంశయంలో పడుతున్నారు. ట్రావెన్‌కోర్ బోర్డు, కేరళ సర్కార్‌పై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కేరళ హైకోర్టు కూడా ఘాటుగా స్పందించింది. స్వామియే శరణం అయప్ప%ా% శరణు ఘోషతో శబరిమల మార్మోగుతోంది. మరోవైపు రికార్డుస్థాయి రద్దీతో భక్తులకు చుక్కలు కన్పిస్తున్నాయి. భక్తులు లక్షల్లో పోటెత్తడంతో క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. కాలుతీసి కాలు కదపలేదని పరిస్థితిలో ఎంతో మంది భక్తులు అయ్యప్పను దర్శించుకోకుండానే వెనుదిరుగుతున్నారు. ఎక్కడ చూసినా ఇసుకేస్తే రాలనంతగా భక్తుల రద్దీ అంతకంతకూ పెరుగుతోంది. కొండ కింద పంబ నుంచి సన్నిదానం వరకు క్యూలైన్లు కిక్కిరిసిపోతున్నాయి.ఘాట్ రోడ్డులో ఎక్కడికక్కడ ఆగిపోయిన వాహనాలు నిలిచిపోయాయి. దర్శనానికి 20 గంటలకు పైగా సమయం పడుతోంది.భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని ట్రావెన్కోర్ దేవస్థానం స్వామి దర్శన సమయాన్ని గంటపాటు పెంచినప్పటికీ%ా% పోటెత్తుతున్న భక్తులకు స్వామి దర్శనం గగనమవుతోంది.

### కేరళ ప్రభుత్వమే కారణం..

శబరిమలలో రద్దీ అంతకంతకు పెరుగుతోంది., క్యూలైన్ల క్రమబద్దీకరణ, భద్రతా ఏర్పాట్లు మాత్రం అరకొరగానే ఉన్నాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. రద్దీని కంట్రోల్ చేయడంలో ప్రత్యామ్నాలు ఏర్పాటు చేయడంలో ..భక్తులకు కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయడంలో ట్రావెన్‌కోర్ బోర్డ్, కేరళ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. శబరిలో భక్తుల దైన్యానికి కేరళ సర్కార్ వైఫల్యేమే కారణమని ట్వీట్ చేశారు కాంగ్రెస్ నేత శశిథరూర్ . మరోవైపు కేరళ బీజేపీ నేత రాజశేఖరన్ శబరిమలను సందర్శించారు. భక్తులకు కనీసం సౌకర్యాలు కల్పించడంలేదని ఆరోపించారాయన. దేశవ్యాప్తంగా ఇలా విమర్శలు, ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

### భక్తుల ఆందోళన

మరోవైపు ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను.. పినరయి సర్కర్ తోసిపుచ్చింది. భక్తులకు ఇబ్బంది కలగకుండా అన్ని చర్యలు చేపట్టామన్నారు కేరళ దేవదాయ శాఖ మంత్రి కె.రాధాకృష్ణన్ . పరిస్థితులు అదుపులోకి వచ్చాయన్నారు. రాజకీయ రాద్ధాంతం చేయకుండా పరిస్థితిని చక్కదిద్దేందుకు అంతా సహకరించాలని కోరింది కేరళ సర్కార్ . శబరిలో భక్తులు ఎదుర్కొంటన్న ఇక్కట్లపై ఎక్కడికక్కడ ఆందోళనలు, నిరసనలు జరుగుతున్నాయి. మరోవైపు శబరికి వెళ్లాలా? వద్దా? అనే డైలామా పడుతున్నారు భక్తులు. అల్రెడీ ఊళ్లలో నుంచి బయలుదేరిన వాళు ..అక్కడి పరిస్థితి గురించి తెలుసుకొని ఆందోళన చెందుతున్నారు.

కేరళ హైకోర్టు శబరిమలలో యుద్ధప్రాతిపదికన పరిస్థితిని చక్కదిద్దలాని ప్రభుత్వాన్ని ఆదేశించింది కేరళ హైకోర్టు. స్పందించిన సర్కార్ ఉన్నపళంగా బందోబస్తు కోసం ఇతర జిల్లాల నుంచి పోలీస్ బలగాలను తరలిస్తున్నారు. డ్రోన్ల సహాయంతో ఎక్కడికక్కడ పరిస్థితులను పర్యవేక్షిస్తూ జాగ్రత్తలు చేపడుతున్నారు. రద్దీని క్రమబద్దీకరించేలా చర్యలను ముమ్మరం చేశారు.



## ఒమన్ సుల్తాన్‌కు రాష్ట్రపతి భవన్‌లో ఘన స్వాగతం

**టీ మీడియా, డిసెంబర్ 16, న్యూఢిల్లీ :**

ఒమన్ సుల్తాన్ హైతం బిన్ తారిక్‌కు శనివారం రాష్ట్రపతి భవన్‌లో ప్రధాని నరేంద్రమోడీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రక్షణ దళాలు ఆయనకు గౌరవ వందనం చేశాయి. హైతం బిన్ తారిక్ భారత్ మూడు రోజుల పర్యటనలో భాగంగా ఆయన శుక్రవారం ఢిల్లీకి చేరుకున్నారు. దీంతో శుక్రవారం ఢిల్లీ విమానాశ్రయంలో కేంద్ర విదేశాంగ శాఖ సహాయ మంత్రి వి. మురళీధరన్ ఆయనను స్వాగతించారు. తారిక్ మూడు రోజుల పర్యటనలో భాగంగా రెండోరోజు శనివారం ఆయన రాష్ట్రపతి భవన్ చేరుకున్నారు. రాష్ట్రపతి భవన్‌లో ఆయనకు లాంఛనప్రాయ స్వాగతం లభించింది. ఈ సందర్భంగా విదేశాంగ మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి అరిందమ్ బాగ్చీ మాట్లాడుతూ.. 'ఒమన్ సుల్తాన్ పర్యటన రెండు దేశాల మధ్య స్నేహం, సహకారాన్ని మరింత పెంచుతుంది' అని ఆయన అన్నారు. తారిక్ పర్యటన వల్ల ఒమన్, భారత్ దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేస్తుంది అని ఈమేరకు బాగ్చీ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. అలాగే న్యూఢిల్లీ, మస్కట్‌ల మధ్య దైత్య సంబంధాలలో సుల్తాన్ భారత్ పర్యటన ఓ మైలురాయిని సూచిస్తుంది అని విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ తెలిపింది. ఒమన్ సుల్తాన్ హైతం బిన్ తారిక్‌కి తొలి భారత్ పర్యటన. భారత్ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆహ్వానం మేరకు ఆయన భారత్‌కు వచ్చారు.



## తెలుగు రాష్ట్రాలను వణికిస్తున్న చలి

**టీ మీడియా, డిసెంబర్ 16, హైదరాబాద్ :**

తెలుగు రాష్ట్రాలను చలి వణికిస్తోంది. ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పడిపోతున్నాయి. చలి తీవ్రత పెరగడంతో జనం ఇళ్లకే పరిమితమవుతున్నారు. తెలంగాణలో శుక్ర, శనివారాల్లో చలి తీవ్రత మరింత పెరగనుందని హైదరాబాద్ వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. తూర్పు ఆగ్నేయ దిశ నుంచి వీస్తున్న గాలుల కారణంగా చలి పెరుగుతుందన్నారు. రాత్రిపూట అతి తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని చెప్పారు. ప్రజలు చలిమంటలు వేసుకుని కాలక్షేపం చేస్తున్నారు. తెల్లవారుజాము నుంచి రోడ్లను కమ్మేస్తున్న పొగమంచు మధ్యాహ్నానికి కూడా వీడడంలేదు. దీంతో చాలాచోట్ల పట్ట పగలు కూడా వాహనదారులు లైట్లు వేసుకుని వెళ్లాల్సి వస్తోంది. ఏపీలోని ఏజెన్సీ ప్రాంతాలలో చలి పంజాకు జనం వణికిపోతున్నారు. ఇటీవలి మిగ్జామ్ తుపాన్ తర్వాత ఉష్ణోగ్రతలు మరింత పడిపోయాయని అధికారులు చెబుతున్నారు. పాడేరులో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దట్టమైన పొగమంచు కమ్మేస్తోంది. రోడ్లపై రెండు అడుగుల దూరంలో ఏమున్నదీ కనిపించని పరిస్థితి నెలకొంటోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో బయట అడుగుపెట్టాలంటే భయపడుతున్నారు. మరో రెండు మూడు రోజులు చలి తీవ్రత కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. కాగా, తిరుమలలో పొగమంచుకు తోడు వర్షం కురవడంతో భక్తులు ఇబ్బంది పడ్డారు. దట్టమైన పొగమంచు కారణంగా పాపవినాశనం, శ్రీవారి పాదాలకు వెళ్లే మార్గాలలో వాహనాల రాకపోకలను టీటీడీ అధికారులు నిలిపివేశారు. శుక్రవారం సాయంత్రం నుంచే వాహనాలను ఆపేశారు. పొగమంచుతో ఘాట్ రోడ్డులో తిరుమల పైకి వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు.




## పార్లమెంట్‌లో భద్రతా వైఫల్యాలకు కారణం నిరుద్యోగం

- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ

**టీ మీడియా, డిసెంబర్ 16, న్యూఢిల్లీ :**

ఢిల్లీలోని భారత పార్లమెంట్‌లో భారీ భద్రతాలోపం బయటపడిన విషయం తెలిసిందే. బుధవారం శీతాకాల సమావేశాలు జరుగుతున్న సమయంలో జీరో అవర్‌లో ఇద్దరు ఆగంతకులు లోక్‌సభ లోకి ప్రవేశించి హంగామా సృష్టించారు. కలర్ స్మోక్ వదిలి ఎంపీలను భయభ్రాంతులకు గురి చేశారు. ఈ ఘటనతో కేంద్ర ప్రభుత్వం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. పార్లమెంట్ ఆవరణలో భద్రతను కట్టుదిట్టం చేసింది. ఈ నేపథ్యంలో భద్రతా ఉల్లంఘన ఘటనపై కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ తాజాగా స్పందించారు. పార్లమెంట్‌లో భద్రతా వైఫల్యానికి కారణం నిరుద్యోగమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ మేరకు ప్రధాని మోదీపై విమర్శలు చేశారు. 'ఇలా ఎందుకు జరిగింది? దేశంలో ప్రధాన సమస్య నిరుద్యోగం. ప్రధాని మోదీ విధానాల వల్ల దేశంలోని యువతకు ఉపాధి లభించడం లేదు. ఈ కారణంగానే ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయి' అంటూ వ్యాఖ్యానించారు.

# అసెంబ్లీ సమావేశాలు 20కు వాయిదా

- సభలో వాడీవేడిగా సాగిన చర్చలు
- ప్రతిపక్షాల దాడికి సీఎం రేవంత్ రెడ్డి రివర్స్ కౌంటర్



**టీ మీడియా, డిసెంబర్ 16, హైదరాబాద్ :**

తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు వాయిదా పడ్డాయి. శనివారం అసెంబ్లీలో వాడివేడీ చర్చల అనంతరం ఈ నెల 20వ తేదీకి వాయిదా వేస్తూ స్పీకర్ గడ్డం ప్రసాద్ ప్రకటన చేశారు. శనివారం అసెంబ్లీ మొదలైన వెంటనే కాంగ్రెస్‌పై ఓ రేంజ్‌లో ఫైర్ అయ్యారు బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్. 50 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో విధ్వంసం తప్ప, చెప్పుకోవడానికి ఏముంది అంటూ ఫైర్ అయ్యారు కేటీఆర్.ఇక ప్రతిపక్షాల దాడికి రివర్స్ కౌంటర్ ఇచ్చారు సీఎం రేవంత్ రెడ్డి. కేటీఆర్ వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో విధ్వంసం, రాచరిక పోకడలు అవలంభించారని మండిపడ్డారు. మొత్తం మీద ఈరోజు తెలంగాణ అసెంబ్లీలో అధికార, విపక్షాల మధ్య వాడీవేడి వాదనలు సాగాయి. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదం తెలిపే తీర్మానంపై సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడిన అనంతరం.. దీనిపై క్లారిఫికేషన్ అడిగేందుకు బీఆర్ఎస్ తరపున మాజీమంత్రి హరీశ్ రావు సిద్ధమయ్యారు. అయితే ఆయన క్లారిఫికేషన్‌కు పరిమితం కాకుండా చర్చ చేయడం సరికాదని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క శాసనసభా వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు సూచించారు.ఇదే విషయంపై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కూడా హరీశ్ రావుకు సూచనలు చేశారు. కేవలం క్లారిఫికేషన్‌కు మాత్రమే పరిమితం కావాలని కోరారు. అయితే గతంలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదం తెలిపే తీర్మానంపై ముఖ్యమంత్రి ప్రసంగం తరువాత ఇద్దరు విపక్ష సభ్యులకు అవకాశం కల్పించారని.. తనకు కూడా అలాంటి ఇవ్వాలని హరీశ్ రావు కోరారు. లేకపోతే తాను నిరసన తెలియజేస్తానని అన్నారు. మరోవైపు సభలో ఈ అంశంపై గందరగోళం కొనసాగుతుండగానే.. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సభను ఈ నెల వాయిదా వేశారు.




## మేడిగడ్డ పునరుద్ధరణ

# మా బాధ్యత కాదు

### ఎల్అండ్‌టీ సంచలన లేఖ

**టీ మీడియా, డిసెంబర్ 16, హైదరాబాద్ :**

మేడిగడ్డ బ్యారేజీలో కుంగిన ప్రాంతం పునరుద్ధరణ బాధ్యత తమది కాదని ఎల్ అండ్,టీ, ప్రాజెక్ట్ ఈఎన్సీ కి, సంచలన లేఖ రాసింది. రిపేర్‌కు అయ్యే ఖర్చు మొత్తం భరించడంతో పాటు అనుబంధ ఒప్పందం చేసు కుంటేనే ముందుకెళ్తామని సంస్థ లేఖలో పేర్కొంది. బ్యారేజీ కుంగిన సమయంలో ప్రాజెక్ట్ ఇంజినీర్లు ఇందుకు భిన్నంగా ప్రకటన చేశారు. నిర్వహణ గడువు ఇంకా ఉందని, పునరుద్ధరణ ఖర్చు మొత్తం నిర్మాణ సంస్థే భరిస్తుందన్నారు.ఎన్నికల సమయంలో ఇంజినీర్లు చేసిన ప్రకటనకు ప్రస్తుతం నిర్మాణ సంస్థ చేస్తున్న ప్రకటనకు పొంతన లేక పోవడంతో మరో సారి ఈ అంశం వివాదాస్పదమవుతోంది. బ్యారేజీ కుంగిన చోట పియర్స్, పిల్లర్లకు ఏం జరిగిందో తెలుసుకోవడానికి ఆ ప్రాంతంలోకి నీరు రాకుం డా మళ్లించేందుకు కాఫర్ డ్యాం నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఇందుకు రూ.55.75 కోట్లు ఖర్చు అవుతుందని ఈ మొత్తానికి ఒప్పందం చేసుకోవాలని ఎల్అండ్‌టీ ఈ నెల 2న కాళేశ్వరం ఈఎన్సీ వెంకటేశ్వర్లుకు లేఖ రాసింది. దెబ్బతిన్న బ్యాక్, పియర్స్ ను రిపేర్ చేయడానికి రూ. 500 కోట్లు వరకు ఖర్చు అవుతుందని ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ పేర్కొంది. తాజాగా ఎల్అండ్‌టీ లేఖలో మేడిగడ్డ బ్యారేజీ పునురుద్ధరణకు అయ్యే ఖర్చు ప్రభుత్వమే భరిం చాలని స్పష్టం చేయడంతో మరోసారి ఈ అంశం హాట్ టాపిక్‌గా మారింది. ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ కీలక నేతలు సైతం నిర్మాణ సంస్థ పునరుద్ధరణ పనులు చేపడుతుందని.. ఆందోళన చెందాల్సినపని లేదని ప్రకటించగా తాజా లేఖతో గులాబీ పార్టీ చిక్కుల్లో పడినట్లయింది.



## ఆ డబ్బు నాది కాదు.. కుటుంబానిది

- కాంగ్రెస్‌కు ఎలాంటి సంబంధం లేదు
- ఎంపీ ధీరజ్ సాహు

**టీ మీడియా, డిసెంబర్ 16, భువనేశ్వర్:**

ఒడిశాలోని కాంగ్రెస్ ఎంపీ ధీరజ్ సాహు నివాసాలతోపాటు ఆయనకు చెందిన మద్యం డిస్టిలరీలు, దాని అనుబంధ సంస్థలపై ఐటీ సోదాలు ముగిశాయి. ఈ నెల 6 నుంచి 15 వరకు పదిరోజులపాటు కొనసాగిన తనిఖీల్లో రూ.351 కోట్ల నగదు, మూడు కిలోల బంగారం పట్టుబడింది. దేశంలో ఇప్పటివరకు పట్టుబడిన నగదు నిల్వల్లో ఇదే పెద్ద మొత్తం కావడం విశేషం. కాగా, ఐటీ దాడుల విషయమై ధీరజ్ సాహు తొలిసారిగా నోరువిప్పారు. పట్టుబడిన సొమ్ము తనది కాదని.. తమ కుటుంబానికి చెందిందన్నారు. తమది కుటుంబ వ్యాపారమని, అదంతా మద్యం అమ్మకాల ద్వారా వచ్చిందేనని చెప్పారు. ఆ డబ్బుతో కాంగ్రెస్‌కుగానీ, మరే రాజకీయ పార్టీకి సంబంధం లేదని స్పష్టం చేశారు. 'ఐటీ రికవరీ చేసిందంతా లిక్కర్ కంపెనీలకు సంబంధించింది. మద్యం అమ్మకాల ద్వారా అది సమకూరింది. తాను ఆ వ్యాపారంలో లేను. ఆ డబ్బంత తనది కాదు. తన కుటుంబానికి, ఇతర కంపెనీలకు చెందింది. దానికి సంబంధించిన ప్రశ్నలన్నింటికీ తమ కుటుంబ సభ్యులు సమాధానం ఇస్తారు. సీజ్ చేసిన డబ్బంతా నల్ల ధనమా లేదా చట్టబద్ధమైనదా అని ఐటీ శాఖ చెబుతుంది' అని సాహు చెప్పారు. సాహూకు చెందిన బౌద్ధ్ డిస్టిలరీ ప్రైవేట్ లిమిటెడ్‌తోపాటు దాని అనుబంధ సంస్థల్లో ఈ నెల 6న ఐటీ తనిఖీలు ప్రారంభమయ్యాయి. రాంచిలోని సాహు కుటుంబంతోపాటు డిస్ట్రిబ్యూటర్ల ఇండ్లు, కంపెనీల్లోనూ తనిఖీలు చేశారు. ఒడిశా, జార?ండ్, పశ్చిమబెంగాల్‌లోని 30 నుంచి 40 చోట్ల దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.351 కోట్ల నగదుతోపాటు మూడు కిలో బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల సందర్భంగా పలు పత్రాలు, ఎలక్ట్రానిక్ పరికరాల నుంచి సేకరించిన డాటాను తమవెంట తీసుకెళ్లారు.

## కర్నూల్ లాడ్జిలో ప్రేమ జంటల హత్య కలకలం

**టీ మీడియా, డిసెంబర్ 16, కర్నూల్ :**



ప్రియురాలిని చంపి.. ప్రియుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోని కర్నూలు జిల్లాలో శనివారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. జిల్లాలోని వుడ్ ల్యాండ్స్ లాడ్జిలో ఘటన చోటు చేసుకుంది. వీరిరువురు నందికొట్కూరు హౌసింగ్ బోర్డ్ కాలనీకి చెందిన ప్రియురాలు రుక్సానా, ప్రియుడు విజయ్ కుమార్ గా గుర్తించారు. విజయ్ కుమార్ ప్రవేట్ కంపెనీలో అకౌంటెంట్ గా పనిచేస్తున్నాడు. వీరి ఆత్మ హత్యకు అక్రమ సంబం ధమే ప్రధాన కారణంగా తెలుస్తోంది. ప్రాథమికంగా అక్రమ సంబం ధమేనని తేల్చిన మూడవ పట్టణ పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు మూడవ పట్టణ సీఐ మురళీధర్ రెడ్డి వెల్లడించారు.

## చిన్నారులతో ఫుడ్ ఫెస్టివల్..

**టీ మీడియా, డిసెంబర్ 16, జన్నారం:**



మండలంలోని కలమడుగు గ్రామంలోని వివేకానంద ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శనివారం ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈ ఫెస్టివల్ లో భాగంగా విద్యార్థులు తయారుచేసిన వంటకాలను ప్రదర్శించారు. పులిహోర ఫ్రైస్, బాలుషా, మిర్చి, బజ్జి ,ఆపడం లాంటి రకరకాల వంటకాలను తయారు చేసే విద్యార్థులు పాఠశాలలో ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కట్ట రాజమౌళి హాజరై వంటకాలను తిలకించారు. వంటకాలు తయారు చేసిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సతీష్ గౌడ్, ఇన్చార్య తిరుపతి, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులకు భవిష్యత్తు కార్యాచరణ పై అవగాహన కార్యక్రమం

**టీ మీడియా, డిసెంబర్ 16, జన్నారం:**




విద్యార్థులకు భవిష్యత్తు కార్యాచరణ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు మండలంలోని కొనకల్లు గ్రామంలో గల జిల్లా పరిషత్ సెకండరీ బాలికల పాఠశాల యందు శనివారం రోజున తల్లిదండ్రులతో ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు సమావేశం ఏర్పరిచి భవిష్యత్ కార్యాచరణకు కార్యక్రమాన్ని విద్యార్థుల సమస్యలు నిర్వహించారు. ఎట్టి కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మండల విద్యాధికారి విజయకుమార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి అరుణాని, ప్రధానోపాధ్యాయులు గొల్ల రామన్న, ఫారెస్ట్ అధికారి హఫీజ్ వద్దీన్, కానిస్టేబుల్ రవీందర్, పంచాయతీ కార్యదర్శి గోపీచంద్ నాయక్, ప్రసాద్, ఉపాధ్యాయులు మల్లేష్ ,సుదేవి, వీరంతా తగు సమయంలో మాట్లాడుతూ 9 వ తరగతి, 10 తరగతి విద్యార్థులకు వారి వారి కార్యాచరణ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారంతా మాట్లాడుతూ ఎంత కష్టమైనా చదువుకోవాలని ,ఎన్ని అవతారాలు వచ్చినా చదువు అపవద్దు అని,ఒక గోల్ నిర్దేశించుకుని క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. చిన్నప్పుడు మేమందరం కూడా పేద కుటుంబం నుండి కష్టపడి చదివి ఉన్నత స్థానాలు పొందినామని, మీరు కూడా కష్టపడి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఈ సందర్భంగా వారందరూ విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు వారి వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.





## అంగన్వాడీ కార్యకర్తల వినూత్న నిరసన

- అంగన్వాడీలకు కనీస వేతనం అమలు చేసేంతవరకు
- నిరవధిక సమ్మె కొనసాగిస్తాం

**టీ మీడియా, డిసెంబర్ 16, మహానంది:**

రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ వర్కర్లు ఆయాలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారం చేయాలని కోరుతూ గత నాలుగున్నర సంవత్సరాల పాటు అనేక రూపాల్లో ఆందోళనలు చేసిన రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అంగన్వాడి కార్యకర్తలు వాపోయారు. శనివారం మహానంది గ్రామంలోని తహసిల్దార్ కార్యాలయం ముందు అంగన్వాడి టీచర్లు సిఐటియూ ఆధ్వర్యంలో ఐదవ రోజు కళ్లకు నల్లగంతాలు కట్టుకుని, మోకాళ్ళపై నిలుచుని నిరసన చేయడం జరిగింది. ఈ సందర్భంగా అంగన్వాడి వర్కర్లు మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం నిరంకుశంగా దుర్మార్గంగా వ్యవహరిస్తూ అంగన్వాడి సెంటర్ల తాళాలు పాలుగొట్టడం అన్యాయమని, రాష్ట్ర ప్రభుత్వానికి కళు ్ళ తెరిపించేలా ఉద్యమాన్ని మరింత ఉధృతంగా కొనసాగిస్తామని అన్నారు. వైసిపి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తూ కళ్ళకు నల్ల గుడ్డలు కట్టుకుని నిరసన తెలియజేస్తున్నామని అన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోకపోతే మా సమస్యలను పరిష్కారం చేసేంతవరకు నిరవధిక సమ్మెలో కొనసాగుతామని అన్నారు. సీఎం జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలన్నీ నెరవేరించాలంటూ నినాదాలు చేస్తూ తమ నిరసనను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్లు ఫాతిమా, చండీ దేవి, సరస్వతి,పుష్పకళ, మరియమ్మ, షాహిన్, సావిత్రి, విజయ, ఉమా మహేశ్వరి, ఆయాలు, తదితరులు పాల్గొన్నారు.



## పచ్చని చెట్లతో.. ఆహ్లాదాన్ని పంచేలా సుందరీకరణ

- జవహర్ నగర్ మేయర్ మేకల కావ్య

**టీ మీడియా, డిసెంబర్ 16, జవహర్ నగర్ :**

పచ్చని చెట్లతో ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేలా పార్కును సుందరంగా తీర్చిదిద్దుతున్నామని మేయర్ మేకల కావ్య అన్నారు. హెచ్ఎండీఏ ప్రత్యేక నిధులు రూ.40లక్షలతో చెన్నాపురంలోని పట్టణ ప్రకృతి వనంలో పార్కుసుందరీకరణ పనుల ఏర్పాట్లను శనివారం మున్సిపల్ కమిషనర్ రామలింగంతో కలిసి మేయర్ కావ్య పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ కావ్య మాట్లాడుతూ కార్పొరేషన్ ప్రజలు సేదాతీరేందుకు పార్కును అత్యద్భుతంగా మార్చుతున్నామని, జవహర్నగర్కు దశాబ్దాల కల శాశ్వతంగా నెరవేరబోతుందని అన్నారు. పార్కుసుందరీకరణ పనుల్లో అలసత్వం ప్రదర్శించరాదని, నాణ్యత ప్రమాణాలు పాటించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈఈ మాధవచారి, ఎన్వీరాన్మెంట్ ఇంజనీర్ సందీప్, శానిటరీ సూపర్వైజర్ కృష్ణప్ప, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆగని ఇసుక మాఫియా.. ధ్వంసం అవుతున్న రోడ్లు


**టి మీడియా, డిసెంబర్ 16, ఓదెల :**

పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం మడక గ్రామం సర్పంచ్, ఉప సర్పంచ్, నిబంధనలకు విరుద్ధంగా, ఇద్దరూ కలిసి, ఇసుకకు సంబంధించిన డబ్బుల కోసం, వ్యక్తిగతంగా బ్యాంక్ అకౌంట్ ఓపెన్ చేసి వచ్చిన డబ్బులను అకౌంట్లో వేస్తు, కాజేస్తున్నారని, మడక గ్రామానికి చెందిన వార్డ్ మెంబర్ రాజేశం, పది రోజుల క్రితం ఫిర్యాదు చేయగా, ఈ రోజున విచారణకు మండల పంచాయతీ అధికారి విచారణ చేపట్టారు. విచారణలో సర్పంచ్ మాదగొని భాగ్యమ్మ, ఉప సర్పంచ్ కోట నిరంజన్ రెడ్డి, వీరిద్దరూ కలిసి,10,90,690. 10 లక్షల 90 వేల 690 రూపాయలు దుర్వినియోగం చేశారని గుర్తించారు. డిసెంబర్ 12, 2023 నుండి 10, మే 2023, వరకు విడతల వారీగా బ్యాంకు నుండి డ్రా చేయడం జరిగిందని గుర్తించారు. సర్పంచ్ ఉప సర్పంచ్ ఇద్దరు కలిసి నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని, అధికార దుర్వినియోగం చేశారని, ఎంపీ ఓ, ఉన్నతాధికారులకు, నివేదిక సమర్పించగా, పంచాయతీరాజ్ చట్టం ప్రకారం,2018లోని సెక్షన్ 37(5)ప్రకారం పెద్దపల్లి జిల్లా కలెక్టర్, నిధుల దుర్వినియోగం చేసిన సర్పంచ్ మరియు ఉప సర్పంచ్ ని సస్పెండ్ చేస్తున్నట్టు ఉత్తర్వులు జారీ చేశారు.

# అందుకే ఆనాడు మంత్రి పదవులకు రాజీనామా చేశాం..

- రేవంత్‌పై హరీశ్‌రావు ఫైర్

**టీ మీడియా, డిసెంబర్ 16, హైదరాబాద్ :**



శాసనభను తప్పుదోవ పట్టించే విధంగా సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. వాస్తవాలను ప్రజల ముందు ఉంచాల్సిన అవసరం ఉందని హరీశ్‌రావు పేర్కొన్నారు. తనకేదో కాంగ్రెస్ ప్రభుత్వం పదవి ఇచ్చిందని రేవంత్ రెడ్డి అనడం సరికాదన్నారు హరీశ్‌రావు. శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా రేవంత్ చేసిన వ్యాఖ్యలకు హరీశ్‌రావు వివరణ ఇచ్చారు. ఈ సభను తప్పుదోవ పట్టించే విధంగా రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు చేశారు. సీఎం మాట్లాడుతూ పోతిరెడ్డి ప్రాజెక్టుపై మా నాయకులే కొట్లాడారు.. రాజశేఖర్ రెడ్డి కేబినెట్‌లో ఉన్నటువంటి మంత్రులు మాట్లాడలేదని ఆయన అన్నారు. దాని మీద వీలైతే చర్చ పెట్టండి. సభ రికార్డులు తీసి బయటపెట్టింది. వీడియో ఫుటేజీ కూడా సభలో ఉంటది.. అది కూడా బయటపెట్టండి. అన్ని విషయాలు బయటపెడితే దాని మీద నేను చర్చకు సిద్ధం. ఆ రోజు రాజశేఖర్ రెడ్డి కేబినెట్‌లో ఆరుగురు మంత్రులు ఉన్నాం. 14 నెలలకే రాజీనామా చేశాం. ఆరు కారణాలు చెప్పి రాజీనామాలు చేశాం. మొదటి కారణం ఏంటంటే.. అక్రమంగా పోతిరెడ్డిపాడు ప్రాజెక్టును పొక్క కొట్టి మా తెలంగాణకు దక్కాల్సిన కృష్ణా జలాలను రాయలసీమకు తరలించుకుపోతున్నందుకు నిరసనగా, ఈ కేబినెట్ నుంచి మేం వైదొలగుతున్నాం. తెలంగాణను ముంచి ఆంధ్రాకు నీళు మళ్లించే పులిచింతల ప్రాజెక్టును ఆపకపోవడం వల్ల కేబినెట్‌కు రాజీనామా చేస్తున్నామని చెప్పాం. 610 జీవో అమలు చేయడం వల్ల నిర్లక్ష్యం కారణంగా, మా తెలంగాణ పిల్లలకు ఉద్యోగాలు దక్కే విషయంలో మా మాట తప్పుతున్నందుకు నిరసనగా రాజీనామా చేస్తున్నామని చెప్పాం. నక్సలైట్లతో చర్చల పేరిట ఫేక్ ఎన్‌కౌంటర్లు చేస్తున్నరు అని చెప్పి రాజీనామా చేస్తున్నామని చెప్పాం. ఇలా ఆరు కారణాలు ఇదే సభలో, బయట చెప్పి మంత్రి పదవులకు రాజీనామా చేసిన విషయాన్ని సీఎం దృష్టికి తీసుకువస్తున్నాను అని హరీశ్‌రావు వివరణ ఇచ్చారు.

## కరీంనగర్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

**టీ మీడియా, డిసెంబర్ 16, కరీంనగర్ :**



కరీంనగర్ లో శనివారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వేగంగా దూసుకొచ్చిన కారు, లారీ అదుపుతప్పి ఒకదానినొకటి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా..మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. జిల్లాలోని శంకరపట్నం మండలంలోని తాడికల్లు సమీపంలో శని వారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనాస్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను పోస్ట్ మార్టం కోసం కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం ఈఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయను న్నట్లు పోలీసులు తెలిపారు.

## రేవంత్ సారూ.. పాతబస్తీ అభివృద్ధిపై దృష్టి సారించండి

- మజ్లిస్ పార్టీ ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ

**టీ మీడియా, డిసెంబర్ 16, హైదరాబాద్ :**



ఓల్డ్ సిటీ అభివృద్ధిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించాలని కోరారు మజ్లిస్ పార్టీ ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ . పాతబస్తీ అభివృద్ధికి ప్రభుత్వానికి పూర్తిస్థాయిలో సహకరిస్తామని హామీ ఇచ్చారు. అసెంబ్లీలో పాతబస్తీ అభివృద్ధిపై మాట్లాడుతూ, ఇమామ్లకు ఇప్పుడు రూ.12వేలు ఇస్తున్నారని, ఇక నుంచి రూ.15వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మదర్సా బోర్డును కూడా ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ ఒక్క ముస్లిం అభ్యర్థిని గెలిపించలేకపోయాయని, ఈ రెండు పార్టీలు ముస్లింల అభివృద్ధికి సహకరించడం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి ముస్లింలు దగ్గరగా ఉండటానికి వైఎస్ఆర్ మాత్రమే కారణమన్నారు. ఆయన హయాంలో మైనార్టీలకు న్యాయం జరిగిందన్నారు. పెండింగ్లో ఉన్న షాదీ ముబారక్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల అభివృద్ధి కోసం ప్రభుత్వానికి పూర్తి సహకారం అందిస్తామన్నారు. ఓల్డ్ సిటీ రోడ్ల వెడల్పు పనులు పెండింగ్లో ఉన్నాయని, అభివృద్ధిపై సీఎం దృష్టి సారించాలన్నారు. డీఎస్సీలో ఉర్దూ పోస్టులను భర్తీ చేయాలని కోరారు.

## బీసీ సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించారు

- నారా లోకేశ్

**టీ మీడియా, డిసెంబర్ 16, విశాఖ :**



ముఖ్యమంత్రిగా జగన్ అధికారంలోకి వచ్చాక బీసీ సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించారని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఆరోపించారు. ఉమ్మడి విశాఖ జిల్లా ఎలమంచిలి నియోజకవర్గంలో 224వ రోజు యువగళం పాదయాత్ర కొనసాగుతోంది. ఈ పాదయాత్రలో భాగంగా అరబుపాలెంలో బీసీల నాయకులు, అనకాపల్లిలోని బెల్లం తయారీదారులు, గంగాదేవిపేటలో రైతులతో లోకేశ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ.. బీసీలపై జగన్ ప్రభుత్వం 26 వేల అక్రమ కేసులు పెట్టిందన్నారు. మేం అధికారంలోకి వచ్చాక బీసీలకు రక్షణ చట్టం తెస్తామన్నారు. ప్రభుత్వ పెద్దల అండతోనే రాష్ట్రంలో గంజాయి సాగు జోరుగా సాగుతోందన్నారు. టిడిపి-జనసేన ప్రభుత్వం అధికారంలోకి రాగానే నల్ల బెల్లంపై ఆంక్షలు తొలగిస్తామన్నారు. చెరకు రైతులకు ప్రభుత్వం తరఫున సహకారం అందించి ఆదుకుంటామన్నారు. వ్యవసాయ రంగం పూర్తిగా సంక్షభంలో కూరుకుపోయిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇరిగేషన్ కాల్వల నిర్వహణను పూర్తిగా గాలికొదిలేశారని అన్నారు. అధికారంలోకి రాగానే శారద కాల్వ పూడిక తీయిస్తామని అన్నారు. కాల్వలో నీరు కలుషితం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

## 175 స్థానాల్లో విజయం సాధించేందుకే అభ్యర్థుల మార్పు

- మంత్రి ఆదిమూలపు సురేష్

**టీ మీడియా, డిసెంబర్ 16, అమరావతి:**



ఆంధ్ర ప్రదేశ్ లో మరోసారి అధికారంలోకి వచ్చే విధంగా 175కు 175 స్థానాల్లో విజయం సాధించటం కోసమే అభ్యర్థుల మార్పు జరుగుతుందని మంత్రి ఆదిమూలపు సురేష్ తెలిపారు. గతంలో 29 ఎస్సీ నియోజకవర్గాలకు 28 స్థానాల్లో వైసీపీ విజయం సాధించింది.. ఈసారి 29 స్దానాల్లో గెలుస్తాం.. చంద్రబాబు కొన్ని మీడియాలను అడ్డం పెట్టుకుని విష ప్రచారం చేసి లబ్ది పొందాలని చూస్తున్నారు అని ఆయన ఆరోపించారు. ఆయన పోటీ చేసే స్థానాన్ని చంద్రగిరి నుంచి కుప్పంకు ఎందుకు మారారు అంటూ మంత్రి ఆదిమూలపు సురేష్ ప్రశ్నించారు. పలు అవినీతి ఆరోపణల్లో కూరుకుపోయి జైలుకు కూడా వెళ్లిన చంద్రబాబు.. ఎన్నికలను దఅష్టిలో పెట్టుకుని మైండ్ గేమ్ ఆడుతున్నారు.. కాంగ్రెస్ కోసం హైదరాబాద్ ను అభివఅద్ధి చేశానని చెప్పుకుని తన వర్గీయుల ద్వారా ప్రచారం చేసిన చంద్రబాబు ఆ సమీప ప్రాంతాల్లో ఎన్ని సీట్లు గెలిపించారో చెప్పాలి.. చంద్రబాబు చెప్పే మాటలకు పొంతన లేదు.. ఆయనది వఅదా ప్రయాసే తప్ప మరొకటి కాదు అంటూ మంత్రి మండిపడ్డారు. చంద్రబాబుకు 175 స్థానాల్లో పోటీలో నిలిపేందుకు అభ్యర్దులు లేరు.. కొండేపి నియోజకవర్గాంలో సమస్యల పరిష్కారంపై దఅష్టి పెట్టామని మంత్రి ఆదిమూలపు సురేష్ తెలిపారు.

## చెరువులో పడి యువకుడు మృతి

- నాగులపాలెం ఎస్సీ కాలనీలో విషాదం

**టీ మీడియా, డిసెంబర్ 16,పర్చూరు :**



చెరువులో పడి యువకుడు మృతి చెందిన సంఘటన బాపట్ల జిల్లా పర్చూరు మండలంలోని నాగులపాలెంలో జరిగింది. నెహ్రూ కాలనీకి చెందిన యువకుడు బేతా సుదర్శన్ రావు (18) మూడు రోజుల క్రితం ప్రార్ధనకు వెళుతున్నానని చెప్పి ఇంట్లో నుండి వెళ్లిపోయాడు. ఆరోజు నుండి తన కుమారుడు కనబడటం లేదని తల్లి కొటేశ్వరమ్మ ఈనెల 14వ తేదీన స్థానిక పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసులు అతని కోసం గాలింపు చేపట్టారు. ఈక్రమంలో శనివారం ఉదయం చెరువు వద్దకు వెళ్లిన కొందరు స్థానికులకు సుదర్శన్ రావు శవం నీళ్ళపై తేలుతూ కనబడింది. దీంతో వారు మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. చెరువు వద్దకు చేరుకున్న తల్లి కొటేశ్వరమ్మ, ఆమె పెద్ద కుమారుడు మృతదేహాన్ని చూసి భోరున విలపించారు. సమాచారం అందుకున్న ఎస్సై రవి శంకర్ రెడ్డి హుటాహుటిన తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్నారు. పరిస్థితిని సమీక్షించి మృతదేహాన్ని పంచాయతీ సిబ్బంది సహకారంతో బయటికి తీయించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పర్చూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తున్నట్లు తెలిపారు. చెరువుని లోతుగా త్రవ్వటం వలనే ఈ ఘోరం జరిగిందని పలువురు కాలనీ వాసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

## 30 మంది విద్యార్థినులను గేంటేసిన యాజమాన్యం

**టీ మీడియా, డిసెంబర్ 16,నెల్లూరు:**




జిల్లాలోని కావలిలో దారుణం చోటు చేసుకుంది. విద్యార్థినుల పట్ల శ్రీసాయి నర్సింగ్ కళాశాల యాజమాన్యం అమానుషంగా ప్రవర్తించింది. ఫీజు కట్టలేదని 30 మంది విద్యార్థినిలను కళాశాల నుంచి యాజమాన్యం గెంటేసింది. విద్యార్థినిలు నర్సింగ్ తఅతీయ సంవత్సరం చదువుతున్నారు. ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధులని వసూలు చేసుకుని కూడా రూ.50వేలు కట్టాలని డిమాండ్ చేశారు. ఎగ్జామ్ ఫీస్ కట్టించుకోకుండా వేధింపులు గురిచేశారు. శ్రీకాకుళం జిల్లాకి చెందిన విద్యార్థినిని రెండు రోజుల కిందట యాజమాన్యం హాస్టల్ నుంచి బయటకి పంపించేసింది. దీంతో విద్యార్థినిలు దిక్కుతోచని స్థితిలో రోడ్డుపై బైఠాయించారు. విషయం తెలిసిన కావలి ఎమ్మార్వో మాధవరెడ్డి కాలేజీ వద్దకి చేరుకున్నారు.




## పేదలను ఆదుకోవడంతోనే... మధురానుబంధం

- హిల్ ఆఫ్ హోప్ సొసైటీ డైరెక్టర్ శ్రీనావాస్ రెడ్డి

**టీ మీడియా, డిసెంబర్ 16, జవహర్ నగర్ :**

పేదలను ఆదుకోవడంతోనే మధురానుబంధం కలుగుతుందని, ప్రతి ఒక్కరూ సహాయం చేసే గుణం అలవర్చుకోవాలని హిల్ ఆఫ్ హోప్ సొసైటీ డైరెక్టర్ శ్రీనావాస్రెడ్డి అన్నారు. శనివారం కార్పొరేషన్లోని 28వ డివిజన్ మధర్ థెరిస్సా కాలనీలో డివిజన్ అధ్యక్షుడు వెంకటేష్ ఆధ్వర్యంలో హిల్ ఆఫ్ హోప్ సొసైటీ సహకారంతో 50 మందికి నిత్యవసర సరకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు శివరాణి, క్రాంతికిషోర్, పార్వతి, మీనా, స్రవంతి, మంజూల, కాలనీవాసులు పాల్గొన్నారు.

## జనవరి నుంచి నల్లమల అడవి ప్రాంతంలో ప్లాస్టిక్ నిషేధం

**టీ మీడియా, డిసెంబర్ 16, మహానంది:**

నల్లమల అడవి ప్రాంతంలో జనవరి 1 వ తేదీ నుంచి ప్లాస్టిక్ నిషేధం గా కొనసాగిస్తున్నట్లుగా నంద్యాల ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ దినేష్ కుమార్ రెడ్డి తెలిపారు. శనివారం మహానంది క్షేత్రం సమీపంలోని అడవి దిగువ ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వల్ల కలుగుతున్న అనర్థాలను ప్రజలకు వివరిస్తూ, వారిలో చైతన్యం కలిగేలా కార్యక్రమాలు చేపడతామన్నారు. పర్యావరణ పరిరక్షణకై ప్లాస్టిక్ రహిత నల్లమలగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు. ఆయన వెంట డిఆర్ఓ హైమావతి అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



## దుప్పటికి అంటుకున్న చలి మంటలు

- వ్యక్తి సజీవదహనం

**టీ మీడియా, డిసెంబర్ 16, విజయనగరం :**

తెలుగు రాష్ట్రాలను చలి గజగజ వణికిస్తోంది. ఈ చలి నుంచి తట్టుకునేందుకు వృద్ధులు చలి మంటలను కాచుకుంటున్నారు. చలి మంటలు దుప్పటికి అంటుకోవడంతో ఓ వృద్ధుడు సజీవదహనం అయ్యాడు. ఈ ఘటన విజయనగరం జిల్లా వేపాడ మండలంలోని బొద్దాం గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. బొద్దాం గ్రామంలో చలి విపరీతంగా ఉండటంతో, తట్టుకునేందుకు ఓ వృద్ధుడు పశువుల పాకలో చలి మంటలు పెట్టుకున్నాడు. పాకలో నిద్రిస్తున్న తిమ్మ నాగమయ్య(75) అనే వృద్ధుడి దుప్పటికి మంటలు అంటుకున్నాయి. దీంతో ఆయన సజీవదహనం అయ్యాడు. అనారోగ్యంతో మంచం పట్టిన ఆయన.. చలి కాచుకునేందుకు పెట్టిన మంటలు దుప్పటికి అంటుకోవడంతో ఈ ప్రమాదం సంభవించినట్లు స్థానికులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడి భార్య సన్యాసమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

